

రెండు రోజుల్లో ఇద్దరు శిశువులు మృతి

జి.మాడుగుల, ఫిబ్రవరి 15 : రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు శిశువులు మృతిచెందిన సంఘటనలు మండలంలో చోటుచేసుకున్నాయి. లువ్వాసింగి పంచాయతీ చుట్టుగుమ్మి గ్రామానికి చెందిన ఇంతింగి రాజారావు, రాజులమ్మ దంపతుల మూడు నెలల ఆడ శిశువు శ్వాససంబంధ సమస్యతో బుధవారం మృతిచెందింది. నుర్మతి పంచాయతీ వాకపల్లి గ్రామానికి చెందిన తల్లె లక్ష్మణరావు, సత్యవతి దంపతుల ఐదు నెలల ఆడ శిశువు కూడా ఇదే తరహా సమస్యతో గురువారం చనిపోయింది.

అధికారులపై సీఎం అసంతృప్తి

'ఆడుదాం...ఆంధ్రా' ముగింపు వేడుకల వైఫల్యంపై ఆగ్రహం

- రెండు రోజుల క్రితం పీఎం పాలెం స్టేడియంలో కార్యక్రమం నిర్వహణ
- స్టేడియం కెపాసిటీ 25,000
- జనం తరలింపునకు వందలాది బస్సులు ఏర్పాటుచేసినా గట్టిగా 5,000 మంది కూడా హాజరుకాని వైనం
- కార్యక్రమం సమయంలోనూ, ఆ తరువాత ఎయిర్‌పోర్టులో జిల్లా అధికారులపై ఆగ్రహం



ఆడుదాం ఆంధ్రా ముగింపు కార్యక్రమంలో ఖాళీగా వున్న ఏడీఏ-వీడీసీఏ స్టేడియం



విచార వదనంతో సీఎం జగన్ (ఫైల్)

విశాఖపట్నం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):

'ఆడుదాం...ఆంధ్రా' ముగింపు వేడుకల నిర్వహణలో విఫమయ్యారంటూ జిల్లా అధికారులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేసినట్టు చెబుతున్నారు. పీఎం పాలెంలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈనెల 13న రాష్ట్రస్థాయి పోటీల ముగింపు వేడుక జరిగిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం హాజరయ్యారు. అయితే స్టేడియం సామర్థ్యం 25 వేలు కాగా కనీసం ఐదు వేల మంది కూడా రాలేదు. ఆ వచ్చిన వారిలో కూడా అత్యధికులు డ్వాక్రా మహిళలు, వలంటీర్లే. దాంతో జన సమీకరణపై అప్పుడే సీఎం తీవ్ర అసహనం వ్యక్తంచేయడం కనిపించింది.

రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో గ్రామ, వార్డు సచివాలయం స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ఐదు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించింది. దీనికోసం ప్రభుత్వం పెద్దఎత్తున ప్రచారం చేసింది. సుమారు రూ.100 కోట్లు వెచ్చించింది. ఈ పోటీలను నిర్వహించడం ద్వారా యువతను ఆకట్టుకోవచ్చునని, ఎన్నికల్లో లబ్ధి పొందవచ్చునని వైసీపీ పెద్దలు భావించారు. కానీ పోటీల నిర్వహణకు సరైన సదుపాయాలు కల్పించకపోవడం, నిబంధనలను పాటించకపోవడం, అనుకూలమైన జట్లకు మేలు కలిగించేలా వ్యవహరించడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఇలాంటి తరుణంలో 'ఆడుదాం...ఆంధ్రా' ముగింపు వేడుకలను ఈనెల 13న నగరంలోని పీఎం పాలెం స్టేడియంలో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. స్టేడియం సామర్థ్యం 27,500 కాగా, వేదిక వెనుక భాగంతో పాటు సమీపంలోని గ్యాలరీలను మినహాయిస్తే 25 వేల మందిని తీసుకురావాల్సి ఉంటుందని వైసీపీ నేతలు, అధికారులు అంచనా వేశారు. ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్‌లో నగరం నుంచి పాల్గొన్న 45 వేల మంది క్రీడాకారుల్లో నాలుగో వంతు వచ్చినా, ఇంకా విద్యార్థులు, మహిళా సంఘాలు, పార్టీ కార్యకర్తలను కలుపుకుంటే సులభంగా 25 వేల మార్కును దాటిపోతారని అధికారులు ధీమా వ్యక్తంచేశారు. జనం తరలింపు కోసం నగరవ్యాప్తంగా 585 ఆర్టీసీ బస్సులను కూడా ఏర్పాటుచేశారు. తీరా వేడుక ప్రారంభమయ్యేసరికి స్టేడియంలో కనీసం నాలుగైదు వేల మంది కూడా లేకపోవడంతో అధికారులతో పాటు పార్టీ నేతలు కంగుతిన్నారు. అప్పటికప్పుడు సమీపంలోని ఇంజనీరింగ్, ఇంటర్ కాలేజీలకు ఫోన్లు చేసి విద్యార్థులను పంపించాలని అధికారులు ఆదేశించారు. అయినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. సీఎం జగన్ స్టేడియంలోకి ప్రవేశించేసరికి జనాలు లేకపోవడంతో అవాక్కయ్యారు. స్టేడియంలోని గ్యాలరీలన్నీ ఖాళీగా ఉండిపోవడంతో అక్కడే పార్టీ నేతలపై తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. ముందుగా అనుకున్నట్టు స్టేడియం చుట్టూ ఓపెన్ టాప్ జీపులో తిరుగుతూ ప్రజలకు అభివాదం చేసే కార్యక్రమాన్ని రద్దు చేశారు. ఇక స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు మీడియా గ్యాలరీ దిగువన ప్రత్యేకంగా సీఎం కోసం ఏర్పాట్లు చేశారు. కానీ సీఎం అక్కడకు వెళ్లకుండా నేరుగా సభా వేదికపైకి వెళ్లిపోయారు. జన సమీకరణలో విఫలమవడంపై అధికారులను పిలిచి అప్పుడే తన అసంతృప్తిని వ్యక్తంచేసినట్టు సమాచారం. వేదిక వద్ద అధికారులు కనీసం స్నాక్స్ కూడా ఏర్పాటుచేయకపోవడంతో ... మిగతా 8వ పేజీలో

దిష్టిబొమ్మల్లా హాట్ బజార్లు!

రెండేళ్ల నుంచి నిలిచిన నిర్మాణాలు

- ఏజెన్సీలో 46 హాట్ బజార్లకు కేంద్రం రూ.2.3 కోట్లు మంజూరు
- రాష్ట్ర ప్రభుత్వానికి విడుదలైన నిధులు
- మూడేళ్ల క్రితం నిర్మాణ పనులు ప్రారంభం
- మొదటి విడత బిల్లులు సీఎంఎఫ్ఎస్‌లో అప్‌లోడ్
- నెలలు గడిచినా విడుదల కాని నిధులు
- ఎక్కడికక్కడ పనులు ఆపేసిన కాంట్రాక్టర్లు

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా ఏజెన్సీలో హాట్ బజార్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండిపోయాయి. గిరిజన రైతులకు ఉపయోగపడేలా హాట్‌బజార్ల నిర్మాణానికి 2021లో కేంద్ర ప్రభుత్వం రూ.2.3 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వానికి విడుదల చేసింది. కానీ ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం వ్యయం చేయకపోవడంతో ఆయా నిర్మాణాలు మూడేళ్ల నుంచి అసంపూర్తిగానే ఉన్నాయి.



పాడేరు మండలం గుత్తులపుట్టులో మొండి గోడలతో దర్శనమిస్తున్న హాట్ బజార్

ఏజెన్సీలోని వారపు సంతల్లో గిరిజన రైతులకు వసతి కల్పించేందుకు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ 2019-20 ఆర్థిక సంవత్సరంలో గిరిజన సహకార సంస్థకు రూ.2.3 కోట్లు మంజూరు చేసింది. అయితే అప్పటికే వారపు సంతల్లో కల్పించిన అనేక రకాలైన వసతులు నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో కేంద్రం ఇచ్చిన నిధులతో అటవీ ఉత్పత్తులను సేకరించే గిరిజనులున్న గ్రామాల్లో హాట్ బజార్ల పేరిట చిన్న భవనాలను నిర్మించాలని జీసీసీ, ఐటీడీఏ అధికారులు నిర్ణయించారు. వెలుగు అధికారులతో కలిసి ఏజెన్సీలో ఎక్కడెక్కడ హాట్ బజార్లను నిర్మించాలనేది నిర్ధారించారు. అనంతగిరిలో-1, అరకులోయలో-5, చింతపల్లిలో-4, డుంబ్రిగుడలో-4, జీకేవీధిలో-6, జి.మాడుగులలో-3, హుకుంపేటలో-7, కొయ్యూరులో-2, ముంచంగిపుట్టులో-3, పాడేరులో-6, పెదబయలులో-5.. మొత్తం 46 ప్రాంతాల్లో హాట్ బజార్లను నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఒక్కో హాట్ బజార్‌కు రూ.5 లక్షలు వ్యయం చేయాలని, పది అడుగుల వెడల్పు, 14 అడుగుల పొడవుతో నిర్మించడంతోపాటు బోరు వేసి తాగునీటి సదుపాయం కల్పించాలని ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళిక రూపొందించారు. 2021 ఆగస్టులో నిర్మాణ పనులు ప్రారంభించారు. నాలుగు నెలల్లోనే నిర్మాణ పనులు పూర్తి చేసి గిరిజన రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు అప్పట్లో భావించారు.

నిధులు విడదల్చని రాష్ట్ర ప్రభుత్వం

ఏజెన్సీలో హాట్‌బజార్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 2021 మార్చిలోనే రాష్ట్రానికి నిధులు విడుదల చేసింది. దీంతో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు ఆయా హాట్ బజార్ల నిర్మాణాలను కాంట్రాక్టర్ల ద్వారా చేపట్టారు. కొంతమేర నిర్మాణాలు జరిగిన తరువాత బిల్లులు అప్‌లోడ్ చేశారు. వారాలు.. నెలలు.. గడుస్తున్నా బిల్లులు మంజూరు కాలేదు. నిర్మాణాలు పూర్తిచేస్తే.. నిధులు విడుదల కాకపోతే ఇబ్బందులు పడతామన్న భయంతో కాంట్రాక్టర్లు 2021 నవంబరులో ఎక్కడికక్కడ నిర్మాణ పనులను ఆపేశారు. అప్పటి వరకు జరిగిన పనులకు సంబంధించిన బిల్లులను సీఎంఎఫ్ఎస్‌లో అప్‌లోడ్ చేసినప్పటికీ ఇంతవరకు ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. బిల్లులు విడుదలైతే తప్ప మిలిగిన పనులు చేపట్టబోమని కాంట్రాక్టర్లు స్పష్టం చేశారు. వాస్తవంగా కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ వాటిని రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్లకు విడుదల చేయకపోవడంతో హాట్ బజార్లు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.



పాడేరు మండలం మినుములూరులో అసంపూర్తిగా వున్న హాట్ బజార్ కట్టడం

అమర్‌కు అవకాశం దక్కేనా?

పార్టీలో జోరుగా చర్చ

- ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లి నియోజకవర్గానికి మలసాల భరత్‌ను ఇన్‌చార్జిగా ప్రకటించిన అధిష్ఠానం
- చోడవరం, ఎలమంచిలి వైపు మంత్రి చూపు
- వ్యతిరేకించిన సిట్టింగ్ ఎమ్మెల్యేలు
- స్వయంకృతాపరాధమేనంటున్న అనుచరవర్గం
- అనకాపల్లి నుంచి తప్పుకుంటానని సీఎంకు స్వయంగా ఆయనే చెప్పినట్టు ప్రచారం



గుడివాడ అమర్‌నాథ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ఐటీ, భారీ పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ఈసారి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దక్కుతుందా?, లేదా?...అనే చర్చ పార్టీ వర్గాల్లో నడుస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లా వైసీపీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, దాదాపు అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించామని, ఒకటి, రెండు మార్పులతో ఆఖరి జాబితా త్వరలో విడుదల చేస్తామని అన్నారు. అయితే ఉమ్మడి విశాఖ జిల్లాలో మంత్రి అమర్‌నాథ్‌కు ఇప్పటివరకూ ఏ నియోజకవర్గం కేటాయించలేదు. దాంతో ఆయన పరిస్థితి ఏమిటని ఆయన అనుచరవర్గం ఆందోళన చెందుతోంది. అంతా ఆయన స్వయంకృతాపరాధమేనని అంటోంది. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత అమర్ నియోజకవర్గం (అనకాపల్లి)లో 'సొంత వర్గం' తయారుచేసుకున్నారు. ఇంకా భూముల వ్యవహారాలు, ఆర్‌ఈసీఎస్‌లో అడ్డగోలు నియామకాల్లో ఆయన పేరు వినిపించింది. ఇక తన శాఖల నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాకు చేసిన మేలు ఏమీ లేకపోవడంతో పారిశ్రామిక వర్గాలు కూడా ఆయనకు ఆమడ దూరంలోనే ఉండిపోయాయి. పార్టీలో చిన్న పదవి వస్తే ఆ సామాజికవర్గం అంతా కలిసి భారీ సన్మానాలు చేయడం రివాజుగా మారింది. కానీ అమర్‌నాథ్‌కు మంత్రి పదవి వచ్చిన తరువాత తన సొంత సామాజికవర్గంలో నేటి వరకు ప్రత్యేకంగా గౌరవించి, సన్మానం చేయకపోవడం గమనార్హం. అధికారం చేపట్టగానే నోటికి వచ్చినట్టు మాట్లాడడమే అందుకు కారణమని ప్రచారం జరుగుతోంది.

ఇదిలావుండగా పార్టీలో అభ్యర్థుల ఖరారు ప్రక్రియ ప్రారంభం కాగానే పార్టీ అధినేత, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అమర్ ... మిగతా 8వ పేజీలో

నా తలరాత జగనే రాస్తారు

- ఎన్నికల్లో పోటీ చేస్తేనే రాజకీయాల్లో ఉన్నట్టా?, లేకపోతే లేనట్టేనా?...
- 15 మంది అభ్యర్థులను గెలిపించే బాధ్యత నాదే
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, భారీ పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వచ్చే ఎన్నికల్లో తన పాత్ర, బాధ్యతలు ఏమిటో చాలా స్పష్టంగా వెల్లడించారు. సిరిపురంలోని చిల్డ్రన్ ఎరీనాలో గురువారం సాయంత్రం వలంటీర్ల సన్మాన కార్యక్రమం పూర్తయిన తరువాత విలేకరులతో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేస్తారని విలేకరులు ప్రశ్నించగా, సీఎం జగన్ రాసిన విధంగానే తన తలరాత ఉంటుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తేనే రాజకీయాల్లో ఉన్నట్టా?, లేకపోతే లేనట్టేనా?...అని ఎదురు ప్రశ్నించారు. పార్టీ కోసం పనిచేయాల్సిన అవసరం వచ్చిందని గుర్తించి తనకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారన్నారు. తనకు ఉమ్మడి విశాఖ జిల్లా డిప్యూటీ రీజనల్ కో-ఆర్డినేటర్ పదవి ఇచ్చారన్నారు. జిల్లాలో వైసీపీ నుంచి పోటీ చేసే 15 మంది అభ్యర్థులను గెలిపించే బాధ్యత తనదేనన్నారు. పూర్తి స్థాయిలో పనిచేసి బాధ్యతలు నెరవేరుస్తానన్నారు.

19న సీఎం రాక?

విశాఖపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈనెల 19వ తేదీన నగరానికి రానున్నారు. చినముషిడివాడలో గల శారదా పీఠం వార్షికోత్సవంలో ఆయన పాల్గొననున్నారు. ఈ మేరకు అమరావతి నుంచి సమాచారం అందడంతో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. అయితే సీఎం పర్యటన షెడ్యూల్ వివరాలు ఇంకా అందాల్సి ఉంది.

మన్యంపై చలి పంజా

కొనసాగుతున్న అత్యల్ప ఉష్ణోగ్రతలు

- జి.మాడుగులలో 6 డిగ్రీలు నమోదు



చింతపల్లిలో కురుస్తున్న మంచు

పాడేరు/ చింతపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మన్యం వాసులను చలితీవ్రత గజగజ వణికిస్తున్నది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు అత్యల్పంగానే నమోదవుతున్నాయి. అర్ధరాత్రి నుంచి మరుసటి రోజు ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు దట్టంగా కురుస్తున్నది. గురువారం జి.మాడుగులలో 6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఇంకా జీకేవీధిలో 6.2 డిగ్రీలు, పాడేరులో 7.4, చింతపల్లిలో 7.5, అరకులోయలో 8.3, పెదబయలులో 8.5, హుకుంపేటలో 9, ముంచంగిపుట్టులో 10.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉష్ణోగ్రతలు దిగజారుతుండడంతో చలిగాలుల తీవ్రత పెరుగుతున్నది. మధ్యాహ్నం ఒకటి, రెండు గంటల మినహా మిగిలిన సమయాల్లో వాతావరణం అతి శీతలంగా వుంటున్నది. సీజన్ ముగింపు సమయంలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా శ్వాస, ఊపిరితిత్తుల సంబంధ సమస్యలు వున్న వారు సతమతం అవుతున్నారు. చలిబారి నుంచి శరీరాన్ని కాపాడుకోవడానికి అధిక సమయం ఉన్ని దుస్తులు ధరిస్తున్నారు. చీకటి పడిన తరువాత ఇళ్ల వద్ద మంటలు పెట్టుకుని చలి నుంచి ఉపశమనం పొందుతున్నారు.

ప్రమాదకరంగా ఘాట్‌రోడ్డు

పలుచోట్ల భారీగా కోతకు గురైన రహదారి అంచులు

- రెండు, మూడు అడుగుల లోతున గోతులు
- డముకు- కాశీపట్నం మధ్య జారిపడుతున్న కొండచరియలు
- పట్టించుకోని ఎన్‌హెచ్ఏఐ అధికారులు



డముకు- లైడా మధ్య రోడ్డు పక్కన ఏర్పడిన భారీ గొయ్యి

అరకులోయ, ఫిబ్రవరి 14: అరకులోయ నుంచి అనంతగిరి మండలం కాశీపట్నం వరకు ఘాట్‌రోడ్డు అంచులు పలుచోట్ల కోతకు గురై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఇటీవల వరకు గోతులతో అధ్వానంగా వున్న ఘాట్ రోడ్డును బాగు చేయించిన హైవే అధికారులు... ఇరువైపులా కోతకు గురైన ప్రదేశాల వద్ద మరమ్మతులు చేపట్టలేదు. దీంతో డ్రైవర్లు ఏ మాత్రం ఆదమరిచినా.. వాహనం టైర్లు రోడ్డు బయటకు వచ్చి ప్రమాదానికి గురయ్యే అవకాశం వుంది. అరకులోయ నుంచి విశాఖపట్నం వైపు వెళుతుంటే బీసుపురం కాఫీ తోటలు దాటిన తరువాత సుమారు 200 మీటర్ల పొడవున ఎడమవైపు రోడ్డు తీవ్ర కోతకు గురైంది. కొన్నిచోట్ల రోడ్డుకు, అంచులకు మధ్య రెండు నుంచి మూడు అడుగుల లోతు వుంది. ఈ ప్రదేశం వద్ద వాహనాలు ఎదురై, పొరపాటున ఎడమ వైపునకు వెళితే ప్రమాదానికి గురికాక తప్పదు. అదే విధంగా డముకు నుంచి శివలింగపురం వరకు పలు మలుపుల వద్ద రహదారి అంచులు కోతకు గురై ప్రమాదకరంగా ఉంది. డముకు నుంచి కాశీపట్నం వరకు కొండచరియలు విరిగి బండరాళ్లు రోడ్డుపైకి జారుతున్నాయి. ఇటువంటి ప్రదేశాల వద్ద రక్షణగోడలు నిర్మించాలి. గతంలో ఆర్‌అండ్‌బీ పరిధిలో వున్న ఈ రోడ్డును జాతీయ రహదారిగా అభివృద్ధి చేస్తుండడంతో నిర్వహణ పనులను కూడా ఎన్‌హెచ్ఏఐకే అప్పగించారు. కాగా ప్రస్తుతం పాడేరు వైపు నుంచి అరకులోయ మండలం కొత్తభల్లుగుడ వరకే జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కొత్తభల్లుగుడ నుంచి అనంతగిరి మీదుగా చిలకలగెడ్డ వరకు పనులకు సంబంధించి డీపీఆర్ మాత్రమే సిద్ధమైంది. పనులు ఎప్పుడు మొదలుపెడతారో తెలియని పరిస్థితి నెలకొంది.



బీసుపురం సమీపంలో కోతకు గురైన రోడ్డు అంచు



డముకు- కాశీపట్నం మధ్య జారిపడిన బండరాళ్లు

వేసవి ముందే అడుగంటిన మత్స్యగెడ్డ

- రానున్న రోజుల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంటుందని గిరిజనులు ఆందోళన

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 15: వేసవి రాక ముందే మత్స్యగెడ్డ పాయలు అడుగంటుతున్నాయి. గత ఏడాది సాధారణంకన్నా తక్కువ వర్షాలు కురవడంతో మత్స్యగెడ్డలోకి (జోలాపుట్టు రిజర్వాయర్) అంతంత మాత్రంగానే నీరు చేరింది. మరోవైపు వేసవిని తలపించేలా ఎండలు కాయడంతో ఆవిరి రూపంలో నీరు తగ్గిపోతున్నది. మండల పరిధిలోని సుజనకోట, కుమ్మరిపుట్టు, పెదగూడ, పేటమాలిపుట్టు, పనసపుట్టు, జోలాపుట్టు, లక్ష్మీపురం, రంగబయలు తదితర ప్రాంతాల్లో మత్స్యగెడ్డ పాయల్లో నీటి నిల్వలు రోజు రోజుకు దిగుజారుతున్నాయి. వేసవి రాక ముందే మత్స్యగెడ్డ ... మిగతా 8వ పేజీలో



సుజనకోట సమీపంలో అడుగంటిన మత్స్యగెడ్డ

నేటి స్పందన కార్యక్రమం రద్దు: కలెక్టర్

పాడేరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం (16వ తేదీ) నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలనాపరమైన కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. అర్జీలు సమర్పించేందుకు శుక్రవారం ఐటీడీఏ కార్యాలయానికి ఎవరూ రావద్దని ఆయన కోరారు. గతవారం కూడా పరిపాలనా కారణాలతో స్పందన కార్యక్రమాన్ని రద్దు చేశారు.

క్రైం... crime news

పశువులు తరలిస్తున్న కంటైనర్ లారీ పట్టివేత

» 65 పశువులు స్వాధీనం... ఇద్దరి అరెస్టు


కోనవానిపాలెం వద్ద లారీ కంటైనర్‌లో పట్టుబడ్డ పశువులు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 15: మండలంలోని కోనవానిపాలెం వద్ద జాతీయ రహదారిపై గురువారం కబేలాకు 65 ఆవులు, ఎద్దులను తరలిస్తున్న కంటైనర్ లారీలో పట్టుకున్నట్టు ఎస్ఐ అట్టాడ విభీషనరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన నౌరంగబాద్ నుంచి విజయవాడ హనుమాన్ జంక్షన్‌కు పశువులతో వెళుతున్న కంటైనర్ లారీని పెనుగొల్లుకు చెందిన గో రక్షణ చారిటబుల్ ట్రస్టు సభ్యులు గొర్ల దేముళ్ళు, ఆర్.లోవరాజు, ఎస్. దేముళ్లు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు జాతీయ రహదారిపై మాటువేసి కంటైనర్ లారీని పెనుగొల్లు దగ్గర నుంచి అడ్డరోడ్డు వరకు వెంబడించి కోనవానపాలెం వద్ద పట్టుకొన్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి లారీని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్, పశువులను తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలు

గొలుగొండ, ఫిబ్రవరి 15: మండలంలోని చీడిగుమ్మల సమీపంలో బైక్ ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి ఎస్ఐ కృష్ణారావు తెలిపిన వివరాలివి. చీడిగుమ్మలకు చెందిన వానపల్లి వెంకట లోవరాజు గురువారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో నర్సీపట్నం బైక్‌పై వెళుతున్నాడు. గ్రామానికి సమీపంలో గల వంతెన వద్దకు వచ్చేసరికి బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. దీంతో అతని తలకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ చెప్పారు.

62 కిలోల గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయితో సీఐ అప్పలనాయుడు, ఎస్సై సురేష్

రోలుగుంట, ఫిబ్రవరి 15: మండలంలోని కొరుప్రోలు శివారున పోలీసులు గురువారం ఉదయం 62 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సీఐ అప్పలనాయుడు తెలిపిన వివరాలు ప్రకారం..ఎస్ఐ సురేష్‌కు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు సిబ్బంది కొరుప్రోలు శివారులో వాహనాల తనిఖీ చేపట్టగా ఒక వాహనంలో గంజాయి లోడ్ చేయడానికి సిద్ధంగా ఉంచినట్టు గమనించి, స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు జి. మాడుగుల మండలం గెమ్మిలి పంచాయతీ వరిగిలపాలెం గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలుడ్ని అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ. 3.10 లక్షలు ఉంటుంది.బాలుడ్ని జువైనెల్ హోంకు తరలించినట్టు సీఐ తెలిపారు.

వలంటీర్లూ వెనుతిరిగారు!

పురస్కారాల ప్రదాన కార్యక్రమం వుడా చిల్డ్రన్ ఎరీనాలో ఏర్పాటు

గుంటూరు నుంచి సీఎం ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం

వినకుండా వెళ్లిపోబోయిన వలంటీర్లు

అడ్డుకుని తిరిగి లోపలకు పంపిన సచివాలయ కార్యదర్శులు


వెళ్లిపోతున్న వలంటీర్లను అడ్డుకుంటున్న దృశ్యం

విశాఖపట్నం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగంపై వార్డు వలంటీర్లు కూడా విసిగిపోయారు. వలంటీర్లకు సేవామిత్ర, సేవా రత్న, వజ్ర పురస్కారాల ప్రదానోత్సవం రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని గురువారం గుంటూరులో నిర్వహించారు. జీవీఎంసీ పరిధిలోని వార్డు వలంటీర్లకు సేవామిత్ర, రత్న, వజ్ర పురస్కారాలను అందజేసే కార్యక్రమాన్ని సిరిపురం కూడలిలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఏర్పాటు చేశారు. వేదికపై మంత్రి అమర్‌నాథ్, జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మ కూర్చున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమైన కార్యక్రమం సాయంత్రం ఆరు గంటల వరకూ సాగింది. గుంటూరులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని ఎల్ఈడీ స్ర్కీన్లపై ప్రత్యక్ష ప్రసారం చేయడంతో...అందరూ శ్రద్ధగా వినాలని అధికారులు ఆదేశించారు. అయితే సీఎం ప్రసంగం ప్రారంభమైన కొద్దిసేపటికే కొంతమంది వలంటీర్లు లేచి బయటకు వెళ్లిపోవడం ప్రారంభించారు. దీనిని వేదికపై ఉన్న మంత్రి, కలెక్టర్ గమనించారు. వలంటీర్లను బయటకు వెళ్లకుండా ఆపాలని అక్కడున్న వార్డు సచివాలయ సిబ్బందికి సూచించారు. దీంతో వార్డు సచివాలయ కార్యదర్శులు పరిగెత్తుకుంటూ వెళ్లి...మెట్లు దిగి బయటకు వెళ్లిపోతున్న వారిని అడ్డుకుని తిరిగి లోపలకు పంపించారు. తర్వాత ఎవరూ వెళ్లకుండా బయట నుంచి తలుపులకు గడియపెట్టేశారు. టాయ్‌లెట్స్‌కు వెళతామన్నా సరే బయటకు పంపించకపోవడంతో చాలామంది మహిళా వలంటీర్లు ఇబ్బందిపడ్డారు.

హస్తకళలు దేశానికి వెన్నెముకలాంటిది

» లేపాక్షి చైర్‌పర్సన్ విజయలక్ష్మి


గొల్లపేటలో శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బృందం

కోటవురట్ల, ఫిబ్రవరి 15: హస్తకళలు దేశానికి వెన్నెముక వంటిదని ఏపీ హస్తకళ అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) చైర్‌పర్సన్ బి.విజయలక్ష్మి అన్నారు. మండలంలో కైలాసపట్నం, గొల్లపేటల్లో లక్కబొమ్మలు తయారీపై ఇస్తున్న శిక్షణ తరగతులను హస్తకళ అభివృద్ధి కార్పొరేషన్ బృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి దేశవ్యాప్తంగా ఉన్న లేపాక్షి ఎంపోరియంల ద్వారా ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేసి వారు తయారుచేసిన బొమ్మలను విక్రయించుకునేందుకు అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి జిల్లా మేనేజరు కార్తీక, సిబ్బంది దయ, మాస్టర్ క్రాఫ్ట్ మెన్‌తురాల శ్రీను పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	240.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

రథసప్తమికి రాజుపాలెం ముస్తాబు

- నేడు ఆదిత్యుని ఆలయంలో ప్రత్యేక పూజలు
- భారీగా తరలిరానున్న భక్తులు
- ఇనుప క్యూలైన్లు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు
- భారీగా పోలీస్ బందోబస్తు


సూర్యనారాయణమూర్తి మూలవిరాట్


రాజుపాలెంలోని రథసప్తమి వేడుకలకు ముస్తాబైన సూర్యనారాయణమూర్తి ఆలయం

అనకాపల్లిరూరల్, ఫిబ్రవరి 15: మండలంలో రాజుపాలెం సూర్యనారాయణమూర్తి ఆలయం రథసప్తమి వేడుకలకు ముస్తాబయ్యింది. కొండదిగువన ఈత చెట్టు మధ్య వెలిసిన స్వామివారిని 2010 సంవత్సరంలో చినజీయర్ స్వామి ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ప్రతిఏటా అరసవల్లిలో జరిగే వేడుకల తరహాలో ఇక్కడ ఆలయంలో రథ సప్తమిని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా ఈనెల 16వ తేదీన జరిగే రథసప్తమి వేడుకలకు ఆలయకమిటీ ఏర్పాట్లు చేసింది. ఆలయానికి


స్వామి దర్శనానికి ఏర్పాటు చేసిన క్యూలైన్లు

రంగులు వేసి సర్వాంగ సందరంగా తీర్చిదిద్దింది. వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు అడుగడుగునా అన్నసమరాధనకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. సూర్య నారాయణ స్వామివారిని సాయంత్రం పుర వీధుల్లో ఊరేగించేందుకు టేకు రథాన్ని సిద్ధం చేశారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రథసప్తమి వేడుకలకు వచ్చే మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నతాధికారులకు భద్రతా ఏర్పాట్లను చేస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా అనకాపల్లి రూరల్, టౌన్, పరవాడ, మునగపాక, కశింకోట, సబ్బవరం, రాంబిల్లి, అచ్చుతాపురం, ఎలమంచిలి పోలీస్ స్టేషన్ల నుంచి ముగ్గురు సీఐలు, 10 మంది ఎస్ఐలు, 20మంది ఏఎస్ఐలు, 145 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు ఆలయ కమిటీ ప్రతినిధులతో చర్చించి నాలుగు చోట్ల పార్కింగ్ స్థలాలను ఎంపిక చేశారు.

నిర్వాసిత యువతకు ఉపాధి కల్పన

» సింహాద్రి ఎన్‌టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సింహాద్రి సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ, ఫిబ్రవరి 15 : నిర్వాసిత గ్రామాల యువతకు ఉపాధి కల్పించేందుకు పెద్దపీట వేశామని సింహాద్రి ఎన్‌టీపీసీ సీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా వెల్లడించారు. గురువారం స్థానిక ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతకు ఉపాధిలో శిక్షణ కల్పించేందుకు విజయవాడకు చెందిన సీఐపీఈటీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. యువతకి శిక్షణ ఇవ్వడంతోపాటు వారికి ఉద్యోగావకాశాలు కూడా కల్పించడం జరుగుతుందన్నారు. నిర్వాసిత గ్రామాల్లో పూర్తిస్థాయి మౌలిక వసతులను కల్పించేందుకు కోట్లాది రూపాయల సీఎస్ఆర్ నిధులను వెచ్చిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలను పూర్తిస్థాయిలో పాటిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషిచేస్తున్నామని చెప్పారు. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డుతో ఆన్‌లైన్ విధానంలో తమ ప్రాజెక్టు అనుసంధానమైనట్టు వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దీపికా లేడీస్ క్లబ్ ద్వారా మహిళలకు టైలరింగ్, బ్యూటీషియన్ వంటి విభాగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఫ్లయాష్ లారీల రాకపోకల కారణంగా రహదారులు దెబ్బతింటున్నాయని, వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని విలేకరులు ప్రశ్నించగా ఇందుకోసం ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు సీజీఎం వెల్లడించారు. నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తే సింహాద్రి ప్రాజెక్టు లక్ష్యమన్నారు. కార్మికుల భద్రతకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని సీజీఎం స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ విభాగాల జీఎంలు డీపీ పాత్ర, టీఆర్ రాజగోపాలన్, పద్మప్రియ, జగన్మోహనరావు, హెచ్‌ఆర్ విభాగం ఏజీఎం బీబీ పాత్ర తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్ వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం


విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డీఈవో


నక్కపల్లి కేజీబీవీ విద్యార్థినికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 15: స్థానిక ఉడ్‌పేట జీవీఎంసీ పాఠశాలలో గురువారం జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ అవార్డు వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనను డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను పరిశీలించారు.

ఇందులో అనకాపల్లి జిల్లా నుంచి 123 ప్రాజెక్టులు.. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఐదు ప్రాజెక్టులు ప్రదర్శించారు. జాతీయస్థాయి పరిశీలకులు డాక్టర్ మోహిత్ రషిద్‌షేక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా సైన్స్ అధికారి కాళిదాసు, అల్లూరి జిల్లా సైన్స్ అధికారి నాగేశ్వరరావు, విద్యాశాఖ ఏడీ ఏ.రవిబాబు పాల్గొనగా చిత్తూరు జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి ప్రదర్శనలో ఇక్కడ ఎంపికైన ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తారని ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ప్రాజెక్టుల ఎంపిక

ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఈ కింది పాఠశాలలకు చెందిన విద్యార్థుల ప్రాజెక్టులు ఎంపికయ్యాయని డీఈవో కార్యాలయ వర్గాలు తెలిపాయి. వీటిలో అనకాపల్లి జిల్లా జంపపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, సీతానగరం, దోసూరు, దొండపూడి, లక్ష్మీపురం, చెట్టుపల్లి, ఏ.కోడూరు, వీరనారాయణం, కశింకోట బాలికోన్నత పాఠశాల, ఎస్.రాయవరం, కశింకోట సెయింట్‌జాన్స్ హైస్కూల్, నక్కపల్లి కేజీబీవీ స్కూల్ విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాయని తెలిపారు.

అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రాజెక్టు కూడా ఎంపికైందని తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన జంపపాలెం విద్యార్థులకు, అల్లూరిజిల్లా చింతపల్లి విద్యార్థులకు డీఈవో బహుమతులు అందజేశారు.

రెండో రోజూ విద్యార్థి సంఘాల ఆందోళన


కళాశాల ఎదుట కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల ఆందోళన

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 15: స్థానిక నరసింగరావుపేటలోని ప్రైవేటు జూనియర్ కళాశాల వద్ద రెండో రోజు గురువారం కూడా విద్యార్థి సంఘాలు, మృతి చెందిన విద్యార్థి కుటుంబసభ్యులు, బంధువులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.రమణ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్. శివాజీ మాట్లాడుతూ మృతి చెందిన విద్యార్థి వంశీ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై ఇప్పటివరకు విద్యాశాఖాధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. వంశీ మృతిపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో విద్యార్థి తండ్రి చిరంజీవి, ఇతర కుటుంబసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తక్షణమే నివేదిక అందించండి

అనకాపల్లిలోని ప్రైవేటు కళాశాలలో చదువుతున్న విద్యార్థి మృతి పై తక్షణమే నివేదిక అందించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు సీతారాం అధికారులను ఆదేశించినట్టు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి వంశీ మృతి వార్త సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో కమిషన్ సీరియస్‌గా తీసుకుందని సీతారాం తెలిపారు. ఈ వ్యవహారాన్ని అన్ని కోణాల్లో విచారణ జరిపి త్వరితగతిన నివేదిక అందించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు, పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు.

కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న మంత్రులు

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, ఫిబ్రవరి 15: కార్పొరేట్ సంస్థలకు జిల్లా మంత్రులు కొమ్ము కాస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు జిల్లా ప్రయోజనాల కంటే కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారన్నారు. మాడుగుల నియోజకవర్గంలో గల పెదకోట రేగుపాలెం వద్ద అదానీ హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణానికి రైవాడ రిజర్వాయర్ నీరు ఇవ్వడానికి సిద్ధమవుతుండడం దారుణమన్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదముందన్నారు. కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ ఇటు రైతాంగాన్ని, జిల్లా ప్రజలను తీవ్రంగా మోసం చేస్తున్నారన్నారు. వ్యవసాయానికి పూర్తిస్థాయిలో నీరందించలేని నాయకులు కార్పొరేట్ సంస్థలకు రిజర్వాయర్ల నీటిని సరఫరా చేసేందుకు సిద్ధమవ్వడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. గంగవరం పోర్టును 32 వేల కోట్ల ప్రభుత్వ ఆస్తిని 646 కోట్లుకు అమ్మేశారని ఆరోపించారు. దీనిపై జిల్లా మంత్రులు నోరెత్తకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గోకివాడ లోవకృష్ణ, మళ్ల గణేష్, మళ్ల శేషు తదితరులు పాల్గొన్నారు.

చుక్కపల్లిలో ఎడ్ల బండ్ల పరుగు పోటీలు


మైదానంలో పరుగు తీస్తున్న ఎడ్లు

చీడికాడ, ఫిబ్రవరి 15: మండలంలోని చుక్కపల్లి గ్రామంలో గురువారం జిల్లాస్థాయి ఎడ్ల బండ్ల పరుగు పోటీలు నిర్వహించారు. గ్రామంలో అభయాంజనేయస్వామి తీర్థం పురస్కరించుకొని నిర్వహించిన ఈ పోటీల్లో 15 జతల ఎడ్లు పాల్గొన్నాయి. విజయనగరం జిల్లా వల్లంపూడి ఎద్దులకు ప్రథమ స్థానం రాగా, అర్జునగిరి ఎద్దులకు 2వ స్థానం, చుక్కపల్లికి మూడవ స్థానం, లెక్కలవానిపాలెం 4వ స్థానం, చుక్కపల్లి ఎద్దులకు 5వ స్థానం వచ్చాయి. విజేతలకు నిర్వాహకులు రూ.12వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు చొప్పున నగదు బహుమతులు అందించారు.

ఇందిరా మార్కెట్లో చెత్త సమస్య పరిష్కారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


మార్కెట్‌లో చెత్తను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

నర్సీపట్నం, ఫిబ్రవరి 15 : పట్టణంలోని ఇందిరా మార్కెట్‌లో ఎట్టకేలకు చెత్త సమస్యకు పరిష్కారం లభించింది. 'చెత్తమయంగా ఇందిరా మార్కెట్' శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు వెనువెంటనే స్పందించారు. ఈ మేరకు మునిసిపల్ కమిషనర్ పూడి రవిబాబు మార్కెట్‌లోని చెత్తను శుభ్రం చేయించేందుకు చర్యలు చేపట్టారు. గురువారం 25 మంది పారిశుధ్య కార్మికులతో మార్కెట్లో గుట్టలా పేరుకుపోయిన చెత్తను ఎత్తించి ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. మార్కెట్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని చుట్టుపక్కల ప్రజలు సూచిస్తున్నారు. అలాగే ప్రతి రోజూ శుభ్రం చేయించేలా చర్యలు తీసుకోవాలని పాలకవర్గం, అధికారులను కోరుతున్నారు.

బాల్య వివాహాల నిరోధానికి పటిష్ఠ చర్యలు చేపట్టాలి

» ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ పీడీ అనంతలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న అనంతలక్ష్మి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 15: బాల్య వివాహాల నిరోధానికి పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ పీడీ కె.అనంతలక్ష్మి అన్నారు. స్థానిక జీవీఎంసీ బాలికోన్నత పాఠశాలలో గురువారం భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కేజీబీవీ ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కుల ఉల్లంఘన లేకుండా చేయాలన్నారు. వైద్యాధికారిణి పావని మాట్లాడుతూ ఎవరైనా లింగనిర్ధారణ పరీక్షలు చేసినా, ప్రోత్సహించినా వారిపై చర్యలు తీసుకుంటారన్నారు. హాస్టళ్లలో ఉన్న పిల్లలకు రక్తహీనత లేకుండా లోపాలను గుర్తించి సరైన విధానంలో పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరుగుతున్నట్టు సమాచారమిచ్చినట్టయితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ జిల్లా అధికారి శరత్‌బాబు, ప్రొటెక్షన్ అధికారిణి పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి

» ఆర్టీవో ప్రకాశరావు


అవార్డులు అందుకున్న డ్రైవర్లతో అధికారులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 15: జాగ్రత్తలను పాటించి ప్రమాదాల రహిత సంస్థగా పీటీడీని తీర్చిదిద్దాలని జిల్లా రవాణా శాఖ అధికారి కేవీ ప్రకాశరావు సూచించారు. గురువారం పీటీడీ డిపోలో జరిగిన రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మోటార్ వాహన చట్టం నిబంధనలను పాటించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఏకాగ్రతతో పనిచేయాలన్నారు. బ్లాక్ స్పాట్‌ల వద్ద జాగ్రత్తలు పాటించాలన్నారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా ఉత్తమ డ్రైవర్లకు పీటీడీ డీపీటీవో కె.పద్మావతి ఆధ్వర్యంలో ఆర్టీవో సత్కరించి, నగదు బహుమతులను అందజేశారు. రీజియన్ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఈఎస్ నారాయణ, ఏఎస్ రావు, సీహెచ్‌ఏ రావు బహుమతులు పొందగా.. అనకాపల్లి డిపో పరిధిలో వీపీ రావు, ఎస్ఆర్ రావు, కేఎస్ వాసు, నర్సీపట్నం డిపో పరిధిలో కేఆర్ బాబు, ఐడీజే రావు, పీపీ రావు బహుమతులు పొందారు. వీరికి ప్రశంసాపత్రాలు, నగదు ప్రోత్సాహాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ పి.పైడపునాయుడు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, పీటీడీ ఏడీఎం రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ఎన్నికల ఏర్పాట్లు

» కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 15: రానున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులందరూ ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులకు అప్పగించిన బాధ్యతలను ఎన్నికల కమిషన్ నిబంధనలమేరకు పనిచేయాలన్నారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలను తూ.చ. తప్పకుండా ఆచరించాలన్నారు. జిల్లాలోని అధికారులను వారి పనిచేసే శాఖ నిబద్ధతను అనుసరించి టీములుగా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వీరందరికీ 16వ తేదీన శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు, కమాండ్ కంట్రోల్‌రూమ్ సెంటర్, వీడియోవీవింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్, అకౌంటింగ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, వీడియో సర్వేలన్స్, ఎక్స్పెండిచర్ అబ్జర్వర్స్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఎన్నికలకు అవసరమైన బందోబస్తును ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న వారంతా నిబంధనల మేరకు నడుచుకోవాల్సి ఉంటుందన్నారు. ఎటువంటి అనుమానాలకు ఆస్కారం లేకుండా విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ విజయభాస్కర్, ముఖ్య ప్రణాళికాధికారి రామారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై సస్పెన్షన్ ఎత్తివేత

పాయకరావుపేట, ఫిబ్రవరి 15: పాయకరావుపేటకు చెందిన ఇద్దరు నేతలపై ఉన్న సస్పెన్షన్‌ను తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం గురువారం ఎత్తివేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీచేశారు. పాయకరావుపేటకు చెందిన టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు,మాజీ వైస్ ఎంపీపీ గొర్రెల రాజబాబు, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావులను గతేడాది ఏప్రిల్‌లో పార్టీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. తాము ఏ తప్పూ చేయకపోయినా తమను అన్యాయంగా సస్పెండ్ చేశారంటూ ఆవేదన వ్యక్తం చేయడంతోపాటు విషయాన్ని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా వీరిద్దరూ పార్టీ వీరాభిమానులుగా పార్టీ కార్యక్రమాలను చేపడుతున్నారు. ఈక్రమంలో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు సస్పెండైన నాయకులు, మాజీ ఎమ్మెల్యే వి.అనితతో ఇటీవల చర్చలు జరిపి సయోధ్య కుదర్చడంతో సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ గురువారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీచేశారు.

కొత్తగా హైడ్రోపోనిక్ సేద్యం

» అగ్రి ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ విద్యార్థుల బంతి సాగు


బంతిసాగు ప్రాజెక్టును చూపుతున్న విద్యార్థులు

అనకాపల్లి అగ్రికల్చర్, ఫిబ్రవరి 15 : మట్టి అవసరం లేకుండా నీటిలో మొక్కలను పెంచే హైడ్రోపోనిక్ పద్ధతి అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. నీరు, షేడ్‌నెట్, కంటైనర్లు ద్రవరూప ఎరువులు వంటివి వాడి పంటలు పండించే ఈ పద్ధతిని తమ ప్రాజెక్టు అంశంగా ఎన్నుకొని వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు బంతి మొక్కలను విజయవంతంగా పెంచుతున్నారు. పట్టణాలు, నగరాల్లో పెరడులేని ఇళ్లు, అపార్టుమెంట్‌లలో మట్టికి బదులుగా నీడలోనే కూరగాయలు, పూలమొక్కలు పెంపకానికి ఈ పద్ధతిని అనుసరించవచ్చని వారు చెబుతున్నారు. అడ్డంగా, నిలువుగా గొట్టాలను ఉంచి వాటిల్లో నీరు నింపి మొక్కలను పెంచుతున్నామని ఈ హారిజంటల్, వెర్టికల్ పద్ధతుల్లో ఏది ఎలాంటి ఫలితాలనిస్తుందనే విషయాలను తెలుసుకుంటామని విద్యార్థులు చెప్పారు. మరికొందరు విద్యార్థులు కూరగాయల అవశేషాలు తమ హాస్టల్ వంటింటి వ్యర్థాలను ఉపయోగించి గ్యాస్‌ను ఉత్పత్తి చేసే ప్రాజెక్టును చేపట్టారు. గురువారం కె.గణేశ్వరి, కీర్తి, ఎం.హర్షిత, పి. మోరిసెన్, రమ్యశ్రీ, ఎం. శ్రీరామ్ ప్రాజెక్టులను ఏడీఆర్ డాక్టర్ పీవీకే జగన్నాథరావు, పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వీఎస్ గోపాలస్వామి పరిశీలించారు.

జగన్‌కు ఓటుతో గుణపాఠం

▸▸ 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ'లో టీడీపీ నాయకులు పిలుపు ▸▸ చంద్రబాబుతో రాష్ట్రానికి మంచి రోజులని స్పష్టీకరణ



నీలకంఠానగర్‌లో ష్యూరిటీ పత్రాలు పంపిణీ చేస్తున్న సురేష్‌కుమార్



బూసిపుట్టులో గ్యారెంటీ మ్యేనిఫెస్టో చూపిస్తున్న దొన్నుదొర తదితరులు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 15 : ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధిని గాలికి వదిలేసి, నియంతగా వ్యవహరిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఇంటికి పంపేందుకు అంతా సిద్ధంగా ఉండాలని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేష్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని నీలకంఠానగర్‌లో గురువారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ఎన్నికల్లో అధికారం చేపట్టిన వెంటనే టీడీపీ ప్రభుత్వం అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రం ప్రగతి పథాన పయనించాలంటే చంద్రబాబునాయుడు వంటి పరిపాలనా దక్షుడు కావాలన్నారు. ఎన్నికల ముందు చేపట్టిన పాదయాత్ర సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నెన్నో హామీలు ఇచ్చి అన్నివర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. వీటన్నింటికీ ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం ష్యూరిటీ పథకాల పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బర్సింగి శ్రీనివాసరావుతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల అభివృద్ధి : దొన్నుదొర

ముంచంగిపుట్టు : టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మారుమూల గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం కల్పించాలని ఆ పార్టీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి సివేరి దొన్నుదొర కోరారు. మండలంలోని అత్యంత మారుమూల పంచాయతీ బూసిపుట్టులో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన పర్యటించి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు కాగానే అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందన్నారు. మళ్లీ ఆంధ్రాకు మంచిరోజులు రావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ కార్యదర్శి గడ్డంగి రామ్మూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు కె.బలరాం, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి ఎ.తిరుపతి, సర్పంచ్‌లు వి.లక్ష్మణ్, కె.శివశంకర్, ధనియా, అరకు పార్లమెంట్ మహిళా ఉపాధ్యక్షురాలు కె.సన్యాసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌డబ్ల్యూలను ఆశ వర్కర్లుగా గుర్తించాలి



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు సుందరరావు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 15 : మారుమూల గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు విధులు నిర్వహించే సామాజిక ఆరోగ్య కార్యకర్తలను ఆశ వర్కర్లుగా గుర్తించకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కారానికి ఇక్కడి ఐటీడీఏ కార్యాలయం ఎదురుగా సీహెచ్‌డబ్ల్యూలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు రూ.10 వేలు వేతనం అందిస్తున్న ప్రభుత్వం, అదే పనిచేస్తున్న వీరికి రూ.నాలుగు వేలు ఇస్తూ శ్రమ దోపిడీ చేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా ఐటీడీఏ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి సీహెచ్‌డబ్ల్యూలను ఆశ వర్కర్లుగా గుర్తించాలని, వారితో సమానంగా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ శిబిరంలో ఆశ కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.దాసమ్మ, ప్రధాన కార్యదర్శి వై.మంగమ్మ, జిల్లా కమిటీ సభ్యురాళ్లు పార్వతమ్మ, కాంతమ్మ, మోదకొండమ్మ, బేబీరాణి, పద్మ, శేషులతో పాటు పాడేరు, హుకుంపేట, చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు మండలాలకు చెందిన సీహెచ్‌డబ్ల్యూలు పాల్గొన్నారు.

ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావు

▸▸ ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి



వసతి గృహంలో మాట్లాడుతున్న కమిషన్ సభ్యురాలు రామలక్ష్మి

అరకులోయ/ డుంబ్రిగుడ, ఫిబ్రవరి 15 : గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో బాలికలు క్షణికావేశంలో బలవన్మరణాలకు, ఆత్మహత్యలకు పాల్పడుతుండడం దురదృష్టకరమని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి అన్నారు. రెండు రోజుల క్రితం అరకులోయ కంఠబౌంసుగుడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఒంబి గ్రామానికి చెందిన వసంత ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలుసుకున్న ఆమె గురువారం సాయంత్రం సదరు పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థినులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. ఏ సమస్య వచ్చినా వసతి గృహాల్లో, పాఠశాలల్లో ఉండే వార్డెన్లు, హెచ్ఎంలు, అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలన్నారు. అంతేతప్ప ప్రాణాలు తీసుకోవడం సరికాదన్నారు. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించే వారికి నగదు బహుమతులు అందిస్తామని వివరించారు. అంతకుముందు మృతురాలు వసంత కుటుంబాన్ని డుంబ్రిగుడ మండలం ఒంబి గ్రామానికి వెళ్లి ఆమె పరామర్శించారు. నిత్యావసర సరకులు అందజేసి, ప్రభుత్వం పరంగా ఆదుకునేందుకు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. పాఠశాల హెచ్ఎం రాజ్యలక్ష్మి, వార్డెన్ మాధవి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు హరి, మాజీ ఎంపీటీసీ రాందాస్, వైసీపీ డుంబ్రిగుడ మండల నాయకుడు రామదాసు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎస్టీ కమిషన్ సభ్యురాలు రామలక్ష్మి డుంబ్రిగుడలో విలేకరులతో మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు.

నేటి బంద్‌ను విజయవంతం చేయండి



ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఎదుట నినాదాలు

చింతపల్లి, ఫిబ్రవరి 15 : ప్రధాని మోదీ విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం చేపడుతున్న గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన ఆచార్య ఎన్‌జీరంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఎదుట కార్మికులు చేపట్టనున్న బంద్‌కు మద్దతు మాట్లాడారు. మోదీ ప్రభుత్వం చేపడుతున్న విధానాల వల్ల రైతులకు అపార నష్టం జరుగుతున్నదన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేపడుతున్నారన్నారు. గిరిజన సంఘం ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కాఫీ గింజలకు జీసీసీ గరిష్ఠ ధరలు

▸▸ దళారీలకు విక్రయించి మోసపోవద్దు

▸▸ డివిజనల్ మేనేజర్ దేవరాజు

చింతపల్లి, ఫిబ్రవరి 15 : ఆదివాసీలు పండించిన కాఫీ గింజలకు గిరిజన సహకార సంస్థ గరిష్ఠ ధరలు అందిస్తున్నట్టు డివిజనల్ మేనేజర్ పి.దేవరాజు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గిరిజన సహకార సంస్థ కాఫీ గింజలు కిలో పార్చిమెంట్‌ను రూ.280, చెర్రీ రూ.145, రొబస్టా రూ.70 ధరలకు కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం రైతులు నుంచి జీసీసీ పార్చిమెంట్, చెర్రీని కొనుగోలు చేస్తున్నదన్నారు. గిరిజన రైతులు కాఫీ గింజలను జీసీసీ ద్వారా మార్కెటింగ్ చేసుకుని గరిష్ఠ ధరలు పొందాలన్నారు. ప్రైవేటు వర్తకులకు విక్రయించుకుని నష్టపోరాద సూచించారు. ప్రైవేటు వర్తకులు తూనిక యంత్రాల ద్వారా రైతులకు మోసం చేసే అవకాశం ఉందన్నారు. జీసీసీ ధరల కంటే తక్కువకు కొనుగోలు చేస్తారన్నారు. జీసీసీ కచ్చితమైన ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలను వినియోగిస్తుందన్నారు. జీసీసీకి రైతులు గింజలు అప్పగించిన మరుసటి రోజే రైతుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. అలాగే చింతపల్లి మండలంలో తాజంగి, గొందిపాకలు, సమగిరి, పెద్దూరు, గూడెంకొత్తవీధి మండలంలో దేవరాపల్లి, జెర్రెలలో ప్రత్యేక సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రైతులు జీసీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.


నేడు డీఎస్సీ నోటిఫికేషన్‌పై రౌండ్ టేబుల్ సమావేశం

పాడేరు రూరల్, ఫిబ్రవరి 15 : రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్ కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆదివాసీలకు తీవ్ర నష్టం జరుగుతుందని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి, ప్రధాన కార్యదర్శి బోయపల్లి సింహాచలం గురువారం ఇక్కడ ఆరోపించారు. ఆదివాసీ హక్కులు కాపాడుకోవడానికి, ఆదివాసీ నిరుద్యోగ యువతీ, యువకులకు జరుగుతున్న అన్యాయంపై చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు స్థానిక గిరిజన భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే జీవో నెంబరు 3, జీవో నెంబరు 117 రద్దు కారణంగా ఆదివాసీ నిరుద్యోగ యువతకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. ఈ విషయంపై ఎన్ని పోరాటాలు చేసినా అధికారులు, ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహిస్తున్న ఈ సమావేశానికి ఆదివాసీ మేధావులు, జేఏసీ ప్రతినిధులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు, విద్యార్థి సంఘాల నాయకులతో పాటు బీఈడీ, డీఎడ్ కోర్సులు పూర్తి చేసిన ఆదివాసీ నిరుద్యోగ యువతీ యువకులు హాజరు కావాలని కోరారు.

'మాతృభాష విద్యా వలంటీర్లను రెన్యువల్ చేయాలి'

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 15 : రానున్న విద్యా సంవత్సరంలో పాఠశాలలు ప్రారంభం నుంచి చివరి వరకు పూర్తిస్థాయిలో మాతృభాష విద్యా వలంటీర్లను రెన్యువల్ చేయాలని ఆ సంఘం జిల్లా కోశాధికారి వి.చంద్రయ్య కోరారు. మాతృభాష విద్యా వలంటీర్లతో గురువారం ఆయన మండల కేంద్రంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకటి, రెండు తరగతులలో తెలుగు అర్థం కాని పిల్లలకు మాతృభాష నుంచి తెలుగులో తర్జుమ చేసి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో కేవలం ఏడు నెలలు మాత్రమే రెన్యువల్ చేసి మిగిలిన రెండు నెలలు రెన్యువల్ చేయకుండా మొండి చెయ్యి చూపడం సరికాదన్నారు. ఈ రెండు నెలల్లో జిల్లా వ్యాప్తం 676 కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. అలాగే విద్యార్థులు విద్యకు దూరమయ్యే అవకాశం కూడా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరంలోనైనా పూర్తిస్థాయిలో ఖాళీలను రెన్యువల్ చేయాలని, లేకుంటే ఆందోళన బాట పడతామని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.కొండయ్య, నాయకులు కె.గణేష్, గిరిజన సంఘ మండల నాయకులు కె.త్రినాథ్, ఎం.ఎం.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం పనుల్లో లోపాలపై పీడీ ఆగ్రహం



ప్రజావేదికను నిర్వహిస్తున్న పీడీ శివయ్య, ఇతర అధికారులు

పెదబయలు, ఫిబ్రవరి 15 : మండలంలో ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి గురువారం ఇక్కడ సామాజిక తనిఖీల ప్రజావేదికను నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, పీడీ శివయ్య సమక్షంలో జిల్లా విజిలెన్స్ సిబ్బంది జనవరి నుండి ఈనెల 14 వరకు పంచాయతీ కేంద్రాలలో తనిఖీలు చేపట్టి గ్రామ సభలు నిర్వహించారు. మండలంలో గల 23 పంచాయతీలలో వివిధ పనులకు మంజూరైన రూ.23.75 కోట్ల పైచిలుకును పనులు చేసిన జాబ్ కార్డుదారుల ఖాతాలలో జమ చేసినట్టు చెప్పారు. పలు పంచాయతీలలో జాబ్‌కార్డులు అప్‌డేట్ చేయలేదని, చాలా చోట్లా జాబ్‌కార్డుదారునికి వందరోజులు పని కల్పించడంలో విఫలమయ్యారని గుర్తించారు. కొన్ని చోట్ల మాస్టర్ రోల్‌లో సంతకం లేకుండానే పేమెంట్లు చేయడం, రశీదు లేకుండానే వేతనదారులకు ఇబ్బంది పెట్టడం, పని చేసినా వేతనదారులకు వేతనాలు అందకపోవడం వంటివి విచారణలో బయటపడింది. రోజువారీ సమావేశాలు నిర్వహించకపోవడం, చనిపోయిన వ్యక్తుల పేర్లను పెట్టి పేమెంట్‌లు మార్చడం వంటి పొరపాట్లను గుర్తించి పీడీ శివయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వేతనాలను తిరిగి వసూలు చేయాలని వీఆర్పీలకు ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపిడీవో విగ్గిన్స్ వైస్ ఎంపీపీలు సోనే, రాజుబాబు, ఏపీడీ గిరిబాబు, డీపీవో నిర్మలదేవి, ఏడీవో వెంకటేశ్వరరావు, ఏపీవోలు అప్పలనాయుడు, మూర్తి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో మరింత విజ్ఞానం

▸▸ డిజిటల్ బోర్డు ప్రారంభోత్సవంలో కలెక్టర్ సుమిత్ కుమార్



గ్రంథాలయంలో డిజిటల్ బోర్డు ప్రారంభోత్సవంలో కలెక్టర్ సుమిత్‌కుమార్

హుకుంపేట, ఫిబ్రవరి 15 : గ్రంథాలయాల ద్వారా యువత విజ్ఞానాన్ని మరింత పెంచుకుని తద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆకాంక్షించారు. మండల కేంద్రమైన హుకుంపేట ప్రభుత్వ గ్రంథాలయంలో గురువారం అన్ని పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను, డిజిటల్ బోర్డును ప్రారంభించి మాట్లాడారు. నీతి ఆయోగ్ సంస్థ నిధులు రూ.5.5 లక్షలతో గ్రంథాలయాన్ని అభివృద్ధి చేసి పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వచ్చే నెల నుంచి డిజిటల్ తరగతులు కూడా ప్రారంభం చేస్తామని చెప్పారు. దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజుబాబు, ఎంపీడీవో వెంకటరావు, జేఈ ధ్రువ, సర్పంచ్ పూర్ణిమ, గ్రంథాలయాధికారిణి మానస పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నియంత్రణకు కృషి చేయాలి

వైద్య సిబ్బందికి డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా సూచన



సమావేశంలోమాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

పాడేరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : క్షేత్ర స్థాయిలో పనిచేసే ఆశ నోడల్ పర్సన్లు మతాశిశు మరణాల నివారణకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సి.జమాల్‌బాషా సూచించారు. ఐటీడీఏ కార్యాలయంలో ఆశ నోడల్ పర్సన్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మహిళలు గర్భదాల్చినప్పటి నుంచే ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రధానంగా వారిని గుర్తించడం, అవసరమైన వారికి వైద్య సేవలు, సూచనలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందుతున్న విధానాన్ని పరిశీలించాలన్నారు. అలాగే గర్భిణి, బాలింతలను నమోదు చేసినపుడు వైద్య సిబ్బందికి ఇచ్చిన మొబైల్ నంబర్‌కు వైద్యారోగ్యశాఖ నుంచి సూచనలు, సలహాలపై రికార్డెడ్ వాయిస్ కాల్స్ వస్తాయన్నారు. ఆయా కాల్స్‌ను సైతం గర్భిణులు, బాలింతలు అనుసరించేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. అలాగే సదరు గర్భిణి ప్రసవించిన ఏడాది వరకు ఆయా వాయిస్ కాల్స్ వస్తాయన్నారు. ఈ విషయాలపై గ్రామాల్లోని గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వాయిస్ కాల్స్ విషయంలో ఆశ నోడల్ పర్సన్లు అనుసరించాల్సిన విధానాలను రిసోర్సుపర్సన్లు ఎల్.రాజు, మోహనరరావు వివరించారు. అలాగే గర్భిణులు, బాలింతలు ఆయా వాయిల్ కాల్స్‌ను మరల వినాలనుకుంటే 14423 టోల్ ఫ్రీ నెంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిక చేసిన వైద్యులు, ఆశ నోడల్ వర్కర్లు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో గిరిజన విద్యార్థినుల ప్రతిభ



ఉమామహేశ్వరి, అఖిల, సౌజన్య

పెదబయలు, ఫిబ్రవరి 15 : ఇటీవల జరిగిన జేఈఈ మెయిన్స్‌లో ముచంగిపుట్టు ఏకలవ్య కళాశాల విద్యార్థిను ప్రతిభ చూపారు. ఈ కళాశాల నుంచి 13 మంది పరీక్ష హాజరు కాగా, ముగ్గురు గిరిజన విద్యార్థినులు అద్భుత ఫలితాలు సాధించారు. మండలంలోని సీకరి గ్రామానికి చెందినలకే ఉమామహేశ్వరి, లక్ష్మీపేట పంచాయతీకి చెందిన కొర్రా అఖిల, సీతగుంట పంచాయతీ రోగులపేట గ్రామానికి చెందిన జుంబు సౌజన్య జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించినట్టు ప్రిన్సిపాల్ కేశవరావు తెలిపారు. ఈ సందర్భంగా వీరిని ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

వేసవి ముందే అడుగంటిన మత్స్యగెడ్డ

... 5వ పేజీ తరువాయి

అడుగంటుతుండడంతో రానున్న రోజుల్లో తాగునీటి సమస్య తీవ్రంగా వుంటుందని పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుండగా జోలాపుట్టు జలాశయం స్పిల్ గేట్ల వద్ద నీటి మట్టం పూర్తిగా పడిపోయింది. కొద్ది రోజుల నుంచి రివర్ స్లూయిస్ (ప్రధాన డ్యామ్ కింద నుంచి) ద్వారా డుడుమ జలాశయానికి, అక్కడి నుంచి మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీటిని సరఫరా చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితి సాధారణంగా వేసవి కాలంలో వస్తుంది. కానీ ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ప్రధాన డ్యామ్ నుంచి నీటిని విడుదల చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

అధికారులపై సీఎం అసంతృప్తి

... 5వ పేజీ తరువాయి

దీనిపై కూడా సీఎం తీవ్రస్థాయిలో చీవాట్లు పెట్టినట్టు తెలిసింది. సీఎం ముభావంగా ఉండడంతో ముగింపు వేడుకల్లో భాగంగా రూ.80 లక్షలు వ్యయంతో ఏర్పాటుచేసిన డ్రోన్‌షోను కూడా అధికారులు రద్దుచేయాల్సి వచ్చింది. కార్యక్రమం ముగిసిన తర్వాత నేరుగా రోడ్డు మార్గంలో ఎయిర్‌పోర్టుకు వెళ్లిన సీఎం జగన్ అక్కడ జిల్లా అధికారులపై తన ఆగ్రహాన్ని వ్యక్తంచేసినట్టు సమాచారం. అంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కార్యక్రమం ముగింపు వేడుకను ఎంతో ఘనంగా చేస్తామని చెప్పి పూర్తిగా చెడగొట్టారని అసహనం వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఎన్నికల ముందు ఇలాంటి పరిస్థితి పార్టీపై ప్రతికూల ప్రభావం చూపుతుందనే స్పృహ కూడా లేదా?...అని ప్రశ్నించినట్టు సమాచారం. అక్కడితో శాంతించని సీఎం జగన్ బుధవారం జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కూడా ఇదే అంశాన్ని మళ్లీ ప్రస్తావించినట్టు తెలిసింది. 'ఆడుదాం ఆంధ్రా' వైఫల్యంపై సీఎం ఆగ్రహంతో ఉన్నారనే అంశంపైనే ప్రస్తుతం జిల్లా అధికారుల మధ్య చర్చ జరుగుతోంది.

అమర్‌కు అవకాశం దక్కేనా?

... 5వ పేజీ తరువాయి

కలిసి...'తనకు అనకాపల్లి కాకుండా వేరే నియోజకవర్గం ఏదైనా కేటాయించండి' అని స్వయంగా కోరినట్టు సమాచారం. దీంతో పెందుర్తి, ఎలమంచిలి, చోడవరం నియోజకవర్గాల నుంచి అమర్ పోటీ చేస్తే ఎలా ఉంటుంది?... అనే అంశంపై సర్వే చేయించారు. ఈ విషయం తెలిసి చోడవరం, ఎలమంచిలి ఎమ్మెల్యేలు గట్టిగా వ్యతిరేకించడంతో అమర్‌కు ఇప్పటివరకూ ఎక్కడా సీటు ఖరారు చేయలేదు.

మలసాలకు సిఫారసు

అనకాపల్లి నుంచి నువ్వు పోటీ చేయకపోతే ఎవరైతే బాగుంటుందో సూచించాలని సీఎం కోరినప్పుడు...అన్ని విధాలా తనకు విశ్వాసపాత్రుడిగా ఉండే మలసాల భరత్‌ని తీసుకువెళ్లి సీఎంకు పరిచయం చేశారు. దాంతో భరత్‌నే నియోజకవర్గ ఇన్‌చార్జిని చేశారు. అలా అనకాపల్లి నుంచి పోటీ చేసే అవకాశం పోయింది. ఇక ఎలమంచిలిలో తన కుటుంబాన్ని కాదని అమర్‌కు టికెట్ ఇస్తే...ఆయన ఓటమికే పని చేస్తానని సిట్టింగ్ ఎమ్మెల్యే కన్నబాబురాజు అధిష్ఠానానికి చెప్పినట్టు ప్రచారం జరిగింది. దాంతో అక్కడ కూడా అవకాశం పోయింది. చోడవరంలో తనను తప్పించి ఎవరికి ఇచ్చినా ఓకే గానీ...అమర్‌కు ఇస్తే మాత్రం ఒప్పుకోనేది లేదని ధర్మశ్రీ పార్టీ పెద్దలకు చెప్పినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆయన్ను అనకాపల్లి నుంచి ఎంపీగా బరిలో దింపడానికి అధిష్ఠానం ఆలోచన చేస్తున్నదంటూ అనుచరులు చెబుతున్నారు. మరోవైపు అనకాపల్లి ఎంపీ అభ్యర్థిత్వం కోసం సిట్టింగ్ ఎంపీ భీశెట్టి సత్యవతితో పాటు విశాఖ డెయిరీ దివంగత ఛైర్మన్ ఆడారి తులసీరావు కుమార్తె, ఎలమంచిలి మునిసిపల్ ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి కూడా ప్రయత్నిస్తున్నారు.

'స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు ధ్రువపత్రాల పరిశీలన రేపు'

పాడేరు రూరల్, ఫిబ్రవరి 15 : గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గల ఆశ్రమ జీపీఎస్ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌జీటీలు, తత్సమాన అర్హత గల ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతలు కల్పించేందుకు శనివారం ధ్రువపత్రాల పరిశీలన చేపట్టనున్నామని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావు తెలిపారు. ఉపాధ్యాయుల ఫైనల్ సీనియారిటీ జాబితాను ఇప్పటికే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా పంపించడం జరిగిందన్నారు. దానికి అనుగుణంగా పదోన్నతులు కల్పించేందుకు ఉపాధ్యాయుల ధ్రువపత్రాలను శనివారం ఉదయం 10 గంటల నుంచి డీడీ కార్యాలయంలో పరిశీలించనున్నామన్నారు. అర్హతగల ఉపాధ్యాయులు ఒరిజనల్ విద్యార్హత పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

కొత్తపల్లి గీతకు ఎంపీ టిక్కెట్ వద్దు : గిడ్డి



గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, ఫిబ్రవరి 15 : బీజేపీ అధిష్ఠానం కొత్తపల్లి గీతకు అరకు ఎంపీ టిక్కెట్ కేటాయించి ఆదివాసీలకు అన్యాయం చేయవద్దని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. మండలంలోని కుమ్మరిపుట్టులో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ఎస్టీ మహిళ కాదని ఆరోపించారు. దీనిపై గిరిజనులు కోర్టులో కేసులు కూడా వేసినట్టు గుర్తు చేశారు. బీజేపీలో ఎంతో మంది సత్తా ఉన్న నాయకులు, మహిళలు ఉన్నారని, వారిలో ఎవ రికి టిక్కెట్ కేటాయించినా గిరిజనులు స్వాగతిస్తారన్నారు. దీనిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి లేఖ రాస్తానని ఆమె వివరించారు.

చింతపల్లిలో మెగా కంటి వైద్య శిబిరం రేపు

చింతపల్లి, ఫిబ్రవరి 15 : ఇక్కడి గిరిజన భవన్‌లో శనివారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి యూవీ గిరి తెలిపారు. శంకర్ ఫౌండేషన్ సహకారంతో గిరిజన ఉద్యోగుల సంఘం ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వివిధ రకాల కంటి సమస్యలకు చికిత్స అందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒకరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు బౌడు గంగరాజు పాల్గొన్నారు.

బోడి దొరకు నేతల పరామర్శ



బోడి దొరను పరామర్శిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్, ఎమ్మెల్యే

విశాఖపట్నం ఫిబ్రవరి 15: అనారోగ్యంతో బాధపడుతూ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న స్వాతంత్ర్య సమర యోధుడు మల్లు దొర మనుమడు బోడి దొరను గురువారం జిల్లా పరిషత్ ఛైర్మన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అనంతరం ఇటీవల చింతపల్లి సమీపంలో జరిగిన ప్రమాదంలో గాయపడిన వంచాలి దుర్గాని, బోనంకి భవానీలను పరామర్శించారు. వారికి కూడా మెరుగైన వైద్యం అందించాలని కేజీహెచ్ వైద్యులకు సూచించారు.

'ఏజెన్సీలో ఉద్యోగాలను స్థానిక గిరిజనులతోనే భర్తీ చేయాలి'

పెదబయలు, ఫిబ్రవరి 15 : ఏజెన్సీలో ప్రాంతంలో గల ఉద్యోగాలను స్థానిక ఆదివాసీలతోనే భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ అల్లూరి జిల్లా కన్వీనర్ రామారావు దొర డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసీల సంక్షేమం కోసం పనిచేస్తున్నమని గొప్పలు చెప్పుకునే వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్‌లో షెడ్యూల్ ప్రాంతాల ఆదివాసీలకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. జీవో నెంబర్ 3 రద్దు సాకుగా చూపించి పాలక పక్షం ఆదివాసీ నిరుద్యోగులను నడి సంద్రంలో ముంచేసిందని మండిపడ్డారు. రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ నియమాలను అనుసరించి ఏజెన్సీ ఉద్యోగాలను స్థానికంగా ఉన్న ఆదివాసీలతోనే భర్తీ చేసేలా నోటిఫికేషన్‌లో మార్పు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి విశాఖ ఏజెన్సీలో 87 పోస్టులకు గాను రోస్టర్ విధానం ద్వారా చూస్తే ఆదివాసీ నిరుద్యోగులకు కేవలం ఐదు పోస్టులే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

సారాతో ఒకరి అరెస్టు

గొలుగొండ, ఫిబ్రవరి 15 : ఐదు లీటర్ల సారాతో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. మండలంలోని అమ్మపేటలో గురువారం సారా విక్రయాలు జరుగుతున్నట్టు అందిన ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేశామన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన చుక్కాల సత్తిబాబును అదుపులోకి తీసుకుని, ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు చెప్పారు.

నేడు నర్సీపట్నంలో జాబ్ మేళా

నర్సీపట్నం అర్బన్, ఫిబ్రవరి 15 : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంఎల్ఏఎస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా జరగనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే గణేశ్ ఇక్కడ ఆవిష్కరించారు. పదిహేను కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదువుకొని 18 నుంచి 35 ఏళ్ల వరకు గల వారు అర్హులు. పూర్తి వివరాలకు 90147 65287, 94947 91935 నంబర్లలో సంప్రదించాల్సిందిగా స్కిల్ డెవలప్‌మెంట్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ కోరారు.

రామాలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన



కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 15 : సీహెచ్.నాగాపురంలో రామాలయం పునర్నిర్మాణానికి సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు గురువారం శంకుస్థాపన చేశారు. టీటీడీ నిధులు రూ.పది లక్షలు, గ్రామస్థులు చందాల ద్వారా వచ్చిన రూ.పది లక్షలు కలిపి రూ.20 లక్షలతో ఈ పనులు చేపడుతున్నారు. వెంకటరమణారావు, రాజేశ్వరి దంపతులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.